TEL: T/TG/ 2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్: హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 39 | ఆదివారం, 22 సెప్టెంబర్, 2024 | పేజీలు 05 | వేల రూ: 04/-

## ఏడు హైకోర్టులకు సీజేల నియామకం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: దేశంలోని ఏడు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తూ శనివారం కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. జులై 11న చేసిన సిఫార్సుల్లో కొన్నింటిని సవరిస్తూ మంగళవారం సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయం తీసుకోవడంతో ఈ నియామకాలు జరిగాయి. ఇవికాకుండా హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస.రామచంద్ర రావును ఝూర?ండ్ హైకోర్టుకు బదిలీ చేసింది. జస్టిస్ రావును ఝూర?ండ్ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసినా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే ఆయన బదిలీ జరిగింది. ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ అదే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్ షక్దర్ హిమాచల్ హైకోర్టు చీఫ్ జస్టిసగా పదోన్నతి పొందారు. ఇదే హైకోర్టుకు చెందిన జస్టిస్ సురేష్ కుమార్ కైత్ మధ్యప్రదేశ్ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. బాంబే హైకోర్టు జడ్జి జస్టిస్ నితిన్ మధుకర్ జమ్‌దార్ కేరళ హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టనున్నారు. బాంబే హైకోర్టుకే చెందిన జస్టిస్ కె.ఆర్.శ్రీరాం మద్రాసు హైకోర్టు సీజేగా పదోన్నతి పొందారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ ఇంద్ర ప్రసన్న మేఘాలయ హైకోర్టు సీజేగా నియమితులయ్యారు. జమ్మూ-కశ్మీర్-లద్దాఖ్ హైకోర్టు జడ్జి జస్టిస్ తాషి రబస్టాన్ అదే హైకోర్టులో సీజేగా విధులు నిర్వర్తించనున్నారు. ఆయన లద్దాఖ్ ప్రాంతానికి చెందిన తొలి ప్రధాన న్యాయమూర్తి కానుండడం విశేషం.

## కేటీఆర్ వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తాం

- రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్
- రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలని నిలదీత
- లేదంటే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని ప్రశ్న
- మంత్రి పొంగులేటి హెచ్చరిక



అమృత్ టెండర్లలో అక్రమాలు జరిగాయన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. అనవసర ఆరోపణలు చేసినందుకు గాను కేటీఆర్‌పై పరువు నష్టం దావా వేసి, చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ... తాము రూ.8,888 కోట్లకు టెండర్లు పిలిచినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తానని, నిరూపించకుంటే కేటీఆర్ రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు. రూ.8,888 కోట్ల టెండర్లు ఎవరు దక్కించుకున్నారో కేటీఆర్ చెప్పాలన్నారు. పోలింగ్ తేదీకి ఒకరోజు ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వమే టెండర్లను కట్టబెట్టిందన్నారు. టెండర్లను రూ.3,616 కోట్ల చొప్పున మూడు ప్యాకేజీలుగా పిలిచారని పొంగులేటి ఆరోపించారు. ఈ టెండర్లలో ఒక దానిని ఖమ్మంలో తనపై పోటీ చేసిన ఉపేందర్ రెడ్డి కూడా దక్కించుకున్నారని తెలిపారు. టెండర్లు వేయవద్దని తాము ఎవరినీ బెదిరించలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ భగీరథ పేరుతో రూ.39 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. వీలైతే ప్రభుత్వానికి సూచనలు చేయాలని, సద్విమర్శలు చేయాలని కేటీఆర్‌కు హితవు పలికారు.

## 100 నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు !



హైదరాబాద్, పాలిటెక్నిక్ కళాశాలలకు అనుబంధంగా రాష్ట్రంలోని వంద అసెంబ్లి నియోజకవర్గాల్లో పారిశ్రామిక శిక్షణా సంస్థలు (అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్స్ ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలను కొత్తగా ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉంది. పాలిటెక్నిక్, ఐటీఐలలో చదివిన విద్యార్థులకు వెంటనే ఉపాధి అవకాశాలు లభ్యమయ్యే విధంగా వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ఈ శిక్షణను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఇప్పించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను కోరారు. కార్మిక, ఉపాధి కల్పనకు సంబంధించి శనివారం సచివాలయంలో ఆశాఖ ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామిక శిక్షణా సంస్థలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా మారుస్తున్న నేపథ్యంలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు ప్రస్తుతమున్న ఐటీఐ, పాలిటెక్నిక్ సిలబస్‌లో పెద్ద ఎత్తున మార్పులు తీసుకురావాలని , ఉన్న సిలబస్‌ను అప్ గ్రేడ్ చేయాలని ఆయన కోరారు. సిలబస్‌ను మార్చేందుకు ప్రత్యేక కమిటీలను నియమించాలని, ఇందులో పారిశ్రామిక వేత్తలు, ఆయా రంగాల ప్రముఖులను, నిపుణులను సభ్యులుగా నియమించి వారి సలహాలు, సూచనలు స్వీకరించాలని కోరారు.

## అమెరికాలో సోదరుడి వివాహ వేడుకలో ఫ్యామిలీతో జాలీగా సమంత

- విస్కాన్సిన్‌లోని లేక్ జెనీవాలో సోదరుడి వివాహం
- ఈ పెళ్లికి సంబంధించిన ఫొటోలను షేర్ చేసిన సమంత
- తల్లి, సోదరుడితో కలిసి దిగిన ఫొటోలను పంచుకున్న నటి

ఈ ఫొటోలో సమంత పర్పుల్ స్లీవ్‌లెస్ గౌన్ ధరించింది. తన కుటుంబ సభ్యులతో దిగిన ఫొటోలు సమంత అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో ఆనందంగా కనిపించింది. ఆమె స్నాప్‌చాట్‌లో ఈ పెళ్లికి స్వాగతిస్తున్నట్లుగా కూడా ఓ బోర్డు ఉంది. "ఈ పెళ్లికి హాజరైనందుకు మాకు ఆనందంగా ఉంది... ఇట్లు డేవిడ్, నికోల్, మా వివాహానికి స్వాగతం" అని రాసి ఉంది. సమంత ఇన్‌స్టాలో ఈ ఫొటోలను షేర్ చేస్తూ వైట్ హార్ట్, స్పార్కిల్ ఎమోజీలతో పాటు 'ఫ్యామిలీ' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత 2010లో నాగచైతన్యతో కలిసి నటించిన 'ఏమాయ చేసావే'తో తన యాక్టింగ్ కెరీర్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత వివిధ భాషల్లో నటించింది. తెలుగులో బృందావనం, దూకుడు, అత్తారింటికి దారేది, రామయ్యా వస్తావయ్యా, రాజుగారి గది 2, ఓహ్ బేబీ, యశోద, శాకుంతలం వంటి సినిమాల్లో నటించి మెప్పించింది. విజయ దేవరకొండ హీరోగా వచ్చిన ఖుషీ సినిమాలో సమంత చివరిసారి కనిపించింది. ఆ తర్వాత స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్' రెండో సీజన్‌లో రాజీ పాత్రను పోషించింది. సమంత నటించిన 'హనీ బన్నీ' రాబోతుంది. ఈ సినిమాను నవంబర్ 7న విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



## అటు భారీ వర్షం.. ఇటు సీఎం కాన్వాయ్..

- వాహనదారులకు నరకం..!
- హైదరాబాద్‌లో భీకరమైన వర్షం
- అందులోనే రోడ్డెక్కిన సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్
- కాన్వాయ్ వెళ్లే వరకు వర్షంలోనే తడిపోయిన వాహనదారులు




హైదరాబాద్‌లో భయంకరమైన వర్షం కురిసింది. వరుణుడు భీకరంగా గర్జించాడు. భయంకరమైన ఉరుములు మెరుపులతో పాటు బలమైన ఈదురు గాలులతో కూడిన కుండపోత వాన.. నగరాన్ని ఒక్కసారిగా అతలాకుతలం చేసింది. నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి. మేఘం విరిగిపడిందా అన్నట్టుగా వర్షం కురియటంతో.. వర్షపు నీరు రోడ్లపై పొంగిపొర్లింది. సరిగ్గా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయం చూసుకుని వరుణుడు విరుచుకుపడటంతో.. రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. శనివారం అయినప్పటికీ.. ఐటీ కంపెనీలు తప్ప మిగితా ఆఫీసులన్ని పని చేస్తుండటంతో.. సరిగ్గా ఇళ్లకు వెళ్లి సమయంలోనే.. వర్షం దంచికొట్టింది. దీంతో.. రోడ్లపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఇక్కడివరకు.. హైదరాబాద్‌లో ఎప్పుడు భారీ వర్షాలు పడినా దాదాపుగా ఇలాంటి పరిస్థితే ఏర్పడుతుంది. రోడ్లు మొత్తం జలమయం కావటంతో.. వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. దీంతో.. వాహనదారులు నరకం చూడాల్సి వస్తుంది. అయితే.. ఈరోజు (సెప్టెంబర్ 21న) మాత్రం మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా.. పంజాగుట్ట నాగార్జున సర్కిల్ గుండా ప్రయాణించే వాహనదారులకు ఆ నరకం డోసు ఇంకాస్త పెరిగింది. అయితే.. దానికి ఓ కారణం భీకరంగా గర్జించిన వరుణుడు అయితే.. అదే సమయంలో ఇంటికి వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి మరో కారణమయ్యారు. అప్పుడే.. వర్షం మొదలైంది. పైనుంచి భోరున వాన కుమ్మరిస్తోంది. జూబ్లీచెక్ పోస్టు నుంచి నాగార్జున సర్కిల్ మీదుగా సికింద్రాబాద్, ఖైరతాబాద్, మెహదీపట్నం మార్గాల్లో వాహనాలు చకచకా ముందుకు కదులుతున్నాయి. అదే సమయంలో బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వైపు వెళ్లేందుకు ఫ్లైఓవర్ నుంచి, ఇటు పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ వెళ్లేందుకు నాగార్జున సర్కిల్ మీదుగా వెళ్లే వాహనాలు కూడా అదే స్థాయిలో వస్తున్నాయి. సరిగ్గా అప్పుడే.. ఒక్కసారిగా పోలీసులు రోడ్లపైకి వచ్చారు. ఎక్కడికక్కడ వాహనాలను నిలిపేశారు. పైనుంచి వర్షం దంచికొడుతుంటే.. పోలీసులు ఎందుకు ఆపారా అని వాహనదారులకు అర్థం కాలేదు.. అందులో కొందరు ధైర్యం చేసి పోలీసులను అడిగితే.. సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్తున్నారని తెలిపారు. వర్షం పడుతుంది కదా.. వాహనదారుల కష్టాలు అర్థం చేసుకుని సీఎం తొందరగానే వెళ్తాడని అందరూ వర్షంలో తడుస్తూనే చూశారు. కానీ.. రేవంత్ వచ్చేందుకు మాత్రం చాలా సమయమే పట్టింది. 15 నుంచి 20 నిమిషాలకు పైగానే ఆ మార్గాల్లోని వాహనదారులంతా భారీ వర్షంలో తడుస్తూ ఉండిపోయారు. అప్పటికి కూడా సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్ చాలా నెమ్మదిగా.. వర్షపు నీటి ప్రవహాన్ని దాటుకుంటూ వెళ్లటం గమనార్హం. సీఎం కాన్వాయ్ వెళ్లిన తర్వాత 5 నిమిషాలకు గానీ.. పోలీసులు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. అప్పటివరకు వాళ్లంతా వర్షంలోనే తడుస్తూ ఉండిపోయారు. ఈ సమయంలో.. కార్లు, బస్సుల్లో ఉన్న వాళ్ల పరిస్థితి ఏమో కానీ.. ద్విచక్రవాహనాలు, ఆటోల్లో ఉన్న వారు మాత్రం నరకం చూశారు. భారీ వర్షానికి.. పిడుగులు వచ్చి తమ మీదే పడుతున్నాయా అన్నట్టుగా గర్జించిన ఉరుములతో భయపడిపోయారు. అప్పటికే కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవటంతో.. వరుణుడు కూడా మరింత డోస్ పెంచటంతో.. ఆ ట్రాఫిక్ క్లియర్ అయ్యేందుకు కొన్ని గంటల సమయం పట్టింది. అయితే.. ఈ విషయంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా సీఎం రేవంత్ రెడ్డికి ప్రశ్నలు సంధిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో.. తన కాన్వాయ్ కోసం ట్రాఫిక్‌ని ఆపొద్దని.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తనకు తెలుసని.. తానూ వాళ్లలో ఒకడినే.. తన ఒక్కడి కోసం వాహనదారులను ఇబ్బంది పెట్టటం సరికాదంటూ.. పోలీసులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే.. ఇప్పుడు మాత్రం సరిగ్గా భారీ వర్షం కురుస్తున్న సమయంలోనే.. సీఎం కాన్వాయ్ రోడ్డెక్కటం.. ఆ వర్షంలోనే వాహనదారులను సుమారు అరగంట పాటు తడిసేలా చేయటంతో పాటు.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు కారణమయ్యారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై అసహనం వ్యక్తం చేశారు. ఎలాగూ సమాచారం ఉంటుంది కాబట్టి.. వర్షం పడే ముందైనా.. లేదా తగ్గాక అయినా రోడ్డెక్కొచ్చు.. కానీ వర్షం పడుతుందని తెలిసి కూడా రోడ్డుపైకి వచ్చి.. ప్రోటోకాల్ పేరుతో వాహనదారులను ఇబ్బంది పెట్టొద్దంటూ సీఎం రేవంత్ రెడ్డికి సోషల్ మీడియాలో పలువురు రిక్వెస్ట్ చేస్తున్నారు. మరికొందరు.. అప్పుడు చెప్పిన మాటలు ఉట్టివేనా రేవంతన్నా అంటూ పెదవి విరుస్తున్నారు.

## మీకు రాత్రిపూట బాగా నిద్రపట్టాలంటే ఇవి తినాల్సిందే!

"పిస్తాపప్పులో ఎక్కువ మొత్తంలో మెలటోనిన్ ఉంటుంది. మెలటోనిన్ అనే హార్మోన్ మన శరీరం నిద్ర, మేల్కొనే ప్రక్రియను నియంత్రిస్తుంది. మీరు పిస్తాలను రోజూ తింటే రాత్రిపూట బాగా నిద్రపోతారు. బాదం పప్పులను తిన్నా కూడా మీరు రాత్రిపూట కంటినిండా నిద్రపోగలుగుతారు. వీటిలో ఉండే మెగ్నీషియం మీ నిద్రను మెరుగుపర్చడానికి సహాయపడుతుంది. ఇది ఒత్తిడిని తగ్గించి. కండరాలను సడలిస్తుంది." అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## రూ.25 లక్షల విరాళం ప్రకటించిన నందమూరి మోహనకృష్ణ, మోహనరూప

ఆంధ్రప్రదేశ్ లో ఇటీవలే భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించడం తెలిసిందే. ముఖ్యంగా విజయవాడలోని బుడమేరు పొంగడంతో భారీ నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో 40 మందికి పైగా మృతి చెందారు. వరద బాధితులకు ఇప్పటికే ఎందరో సినీ ప్రముఖులు అండగా నిలిచారు. ఈ క్రమంలో నందమూరి మోహనకృష్ణ కూడా స్పందించారు. నందమూరి మోహనకృష్ణ, ఆయన కుమార్తె నందమూరి మోహన రూప తమ వంతు సహాయంగా వరద బాధితుల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.25 లక్షలు విరాళంగా ప్రకటించారు. ఈరోజు వారిద్దరూ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును స్వయంగా కలిసి రూ.25 లక్షల రూపాయల చెక్కును అందించారు. గతంలో కూడా నందమూరి మోహనకృష్ణ, నందమూరి మోహన రూప ఇదే విధంగా ఎంతోమందికి సహాయం చేశారు. టీటీడీ అన్నదాన ట్రస్ట్ కు విరాళాలు ఇచ్చారు. నందమూరి మోహన రూప గత ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో తెలుగుదేశం పార్టీ తరఫున చాలా చురుకుగా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నందమూరి మోహనకృష్ణ ఫిలిమ్ ఇన్ స్టిట్యూట్లో చదివే రోజుల్లో గోల్డ్ మెడలిస్ట్. నందమూరి మోహనకృష్ణ కెమెరామన్ గా ప్రసిద్ధికెక్కారు. తన తండ్రి నందమూరి తారక రామారావు నటించిన బ్రహ్మంగారి చరిత్ర, అనురాగ దేవత, చండశాసనుడు, నందమూరి బాలకృష్ణ గారు నటించిన పలు సినిమాలకు, విక్టరీ వెంకటేష్ గారు నటించిన శ్రీనివాస కళ్యాణం, అదే విధంగా తమిళ్ లో శివాజీ గణేషన్ గారు, ప్రభు గారు నటించిన చరిత్ర నాయగన్, హిందీ లో ఫరూక్ షేక్ గారు నటించిన ఘర్ వాలీ బాహర్ వాలీ సినిమాలకు డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా, పలు సినిమాలకు నిర్మాతగా, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ గా వ్యవహరించారు.

